జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
శనివారం
14-02-2026
స్టేట్ న్యూస్
WWW.DASHANEWS.COM

## ఇబ్రహీంపట్నం గడ్డపై గులాబీ ప్రభంజనం..

# వ్యూహం మంచిది.. విజయం రెడ్డిది

## మున్సిపోల్స్‌లో కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రశాంత్ రెడ్డి పొలిటికల్ మాస్టర్ క్లాస్



**దశ, రంగారెడ్డి :**
ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో ఇబ్రహీంపట్నం రాజకీయ దిశ స్పష్టమైంది. గులాబీ జెండా మరోసారి ఎగిసిపడింది. మొత్తం 24 వార్డుల్లో 13 స్థానాలను కైవసం చేసుకుని బీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఇది కేవలం సంఖ్యల విజయం కాదు... వ్యూహం, శ్రమ, సమన్వయం, స్థానిక అనుబంధం కలిసిన విజయగాథ.
ఈ విజయానికి రూపకర్తగా రాష్ట్ర యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పేరు వినిపిస్తుండగా, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ యంత్రాంగం సమగ్రంగా పనిచేయడం కీలక పాత్ర పోషించింది.

### బూత్ నుంచి వార్డు వరకు - కట్టుదిట్టమైన వ్యూహం.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజు నుంచే బీఆర్ఎస్ కార్యాచరణ ప్రారంభమైంది. ప్రతి బూత్‌కు ప్రత్యేక ఇన్‌చార్జ్‌లు.. ఇంటింటి ప్రచారం.. ఓటర్ల జాబితాల సూక్ష్మ విశ్లేషణ.. యువజన, మహిళా బృందాల సమన్వయం.. "ప్రతి ఓటు విలువైనదే" అన్న నినాదంతో సాగిన ప్రచారం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువతలో పార్టీకి ఊహించని మద్దతు లభించింది.

### అభివృద్ధి పునాదులపై నిర్మించిన విశ్వాసం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేపట్టిన రహదారులు, నీటి సదుపాయాలు, విద్యుత్, కాలనీల అభివృద్ధి వంటి పనులు ప్రజల మదిలో నిలిచాయి. ఆ అభివృద్ధి ట్రాక్ రికార్డ్ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బలమైన ఆయుధంగా మారింది. ప్రశాంత్ రెడ్డి తన ప్రచారంలో "మాటలకంటే పనులు ముఖ్యం" అన్న సందేశాన్ని బలంగా చాటారు.

**స్థానిక సమస్యలు - డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్స్, రోడ్ల మరమ్మతులు - వీటిపై కేంద్రీకృత ప్రచారం నిర్వహించడం ఓటర్లను ఆకర్షించింది.**

### ప్రతిపక్ష సమీకరణాలపై వ్యూహాత్మక దెబ్బ..

ప్రతిపక్ష పార్టీల మధ్య ఓట్ల విభజన, అంతర్గత అసంతృప్తి బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణాన్ని సృష్టించింది. అయితే పార్టీ వర్గాల ప్రకారం, కేవలం ఓట్ల విభజన వల్ల కాదు - క్రమశిక్షణ, గ్రౌండ్ వర్క్, ప్రజలతో నిరంతర అనుబంధం వల్లే విజయం సాధ్యమైందని చెబుతున్నారు.

### "బంటి బాబు" బ్రాండ్ - ప్రజల్లో బలమైన కనెక్ట్

స్థానికంగా "బంటి బాబు"గా పేరుపొందిన ప్రశాంత్ రెడ్డి యువతతో సన్నిహితంగా మమేకమయ్యారు. క్రీడా కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, పబ్లిక్ మీటింగ్స్ ద్వారా ప్రజలలో ప్రత్యక్ష అనుబంధం ఏర్పరిచారు.
ఈ ఎన్నికల ఫలితాలతో ఆయన నాయకత్వానికి ముద్ర పడిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

### ఎమ్మెల్యే రేసులో ముందంజ?.

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఫలితాలు భవిష్యత్ అసెంబ్లీ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భవిష్యత్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వ పోటీలో ప్రశాంత్ రెడ్డి పేరు ముందంజలో వినిపిస్తోంది. పార్టీ అధినేత కెసిఆర్ యువనేత కేటీఆర్ మార్గదర్శకత్వంలో రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ మరింత బలపడనుందని శ్రేణులు విశ్వసిస్తున్నాయి.

మున్సిపాలిటీ పగ్గాలు చేతుల్లోకి వచ్చిన నేపథ్యంలో పారదర్శక పాలన, వేగవంతమైన అభివృద్ధి, ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం - ఇవే ప్రధాన అజెండాగా ప్రకటించారు. "ప్రజలు పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. ఇబ్రహీంపట్నాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం" అని పార్టీ నేతలు పేర్కొన్నారు.
ఇబ్రహీంపట్నం గడ్డపై గులాబీ ప్రభంజనం స్పష్టమైంది.
రంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది.

**ఇక అభివృద్ధే లక్ష్యం..**




**వ్యూహం ఫలించింది... నాయకత్వం మెరిసింది... గులాబీ గర్జన మోగింది!**